సాక్షి సూర్యాపేట

శుక్రవారం ౹ 19 ౹ మే ౹ 2023



కన్నెకల్లు సందర్శనకు..

కన్నెకల్లుకు, తమ పూర్వీకులకు సంబంధం ఉందని తెలుసుకున్న బ్రహ్మానందం ఆ గ్రామానికి రానున్నారు.

- 10లో



బుద్ధవనం.. నందనవనం

బుద్ధవనం బౌద్ధులకు నందనవనమని మయన్మార్ మత వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నారు.

- 10లో

గరిష్ఠం/కనిష్ఠం 41°/27°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పూట సూర్యరశ్మి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పనుల్లో వేగం పెంచాలి



జిల్లా పోలీసు నూతన కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయం నూతన భవన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. కార్యాలయ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్లు త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్‌ఐ సైదులు, సిబ్బంది తదితరులున్నారు.

వయోవృద్ధులను సంరక్షించాలి



విచారణ చేస్తున్న జ్యోతిపద్మ

తుంగతుర్తి: వయోవృద్ధుల సంరక్షణ బాధ్యత పిల్లలపై ఉందని జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) జ్యోతిపద్మ అన్నారు. గురువారం తుంగతుర్తి మండల పరిధిలోని తూర్పుగూడెంలో గ్రామానికి చెందిన గుండగాని రామయ్య–బుచ్చమ్మల దంపతులు తమ కుమారులు తమ బాగోగులు చూడటం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీడబ్ల్యూఓ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధులపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. అనంతరం గ్రామంలో ఫిర్యాదుదారుల కుమారులను పిలిపించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ భీమ్‌సింగ్, సర్పంచ్ పూలమ్మ, సీడీపీఓ శ్రీజ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న యాదయ్య

అర్వపల్లి: గ్రామాల అభివృద్ధికి చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య కోరారు. గురువారం అర్వపల్లి, రామన్నగూడెం, జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామాల్లో రోడ్లను శుభ్రం చేయడం, గుంతలు పూడ్చడం, పిచ్చి మొక్కల తొలగింపు, మురుగుల కాలువలు శుభ్రం చేయడం, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాలు శుభ్రపరచడం, శిథిలావస్థలో ఉన్న ఇళ్ల తొలగింపు, పాడుబడిన బావులను పూడ్చడం, తాగునీటి వనరుల తనిఖీ, శుభ్రపరచడం, క్లోరినేషన్ తదితర పనులను ఈనెల 23వరకు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ కతురోజు ఉమేష్, ఎంపీఓ ఉపేందర్‌రావ్, కార్యదర్శులు మాగి నాగయ్య, నవీన్‌రెడ్డి, నెహ్రూనాయక్, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

వేసవిలో పశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి



తుంగతుర్తి పశువైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

తుంగతుర్తి: వేసవిలో పశువులు అనారోగ్యం బారిన పడకుండా సంరక్షించుకోవాలని పశువైద్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలోని పశువైద్యశాలను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. వేసవి నేపథ్యంలో పశువులు, మేకలు, గొర్రెలను ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకెళ్లాలన్నారు. వేడి గాలికి పశువులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట ఏడీఏ రవిప్రసాద్, సుష్మ, బుచ్చిబాబు తదితరులున్నారు.

● ఎండల్లో హాయ్.. హాయ్



మండుతున్న ఎండలకు మనుషులతో పాటు పశుపక్షాదులు అల్లాడిపోతున్నాయి. వేసవి తాపం నుంచి బయటపడేందుకు జనాలు ఏసీలు, కూలర్లను ఏర్పాటు చేసుకుంటుండగా.. పశువులు చెరువులు, కుంటలను ఆశ్రయిస్తున్నాయి. సూర్యాపేట సమీపంలోని రాంకోటితండా వద్ద గల క్వారీ నీటిలో గేదెలు పెద్ద ఎత్తున మధ్యాహ్న సమయంలో ఇలా సేద తీరుతున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

కొనుగోళ్లు అంతంతే..

- వరి ధాన్యం సేకరణ లక్ష్యం 7.04లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 2.47లక్షల మెట్రిక్ టన్నులు
- మే చివరి నాటికి ముగియనున్న సేకరణ
- మరో 1.50లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అవకాశం



పెన్‌పహాడ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్ (ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఊరూరా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ సీజన్లో రైతులు కొనుగోలు కేంద్రాలకు 7.04లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తీసుకువస్తారని అంచనా వేశారు. అయితే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 45 రోజులు గడిచింది. మరో వారంలో కోతలు పూర్తవుతుండడంతో ఈ నెల చివరి నాటికి కొనుగోళ్లు కూడా చివరి దశకు రానున్నాయి. ఇప్పటి వరకు కేవలం 2.47 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. మిగిలిన పదిహేను రోజుల్లో మరో 1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఈ లెక్కన కొనుగోలు చేసినా 3లక్షల మెట్రిక్ టన్నులకు మించడం లేదు. ప్రభుత్వ అంచనాలకు భిన్నంగా సుమారు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తగ్గిపోతుంది.

ప్రైవేట్‌కు మొగ్గు..

అకాల వర్షాలకు కొంత ధాన్యం నేలరాలడం, దిగుబడి కూడా ఆశించిన మేరకు రాకపోవడంతో చాలామంది రైతులు ధాన్యం అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు రాకుండా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారని భావిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వారం, పది రోజులపాటు వేచి చూడాల్సి రావడం, తరుగు తీయడం, రైతులే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువెళ్లి, మళ్లీ ఆ ధాన్యంతో మిల్లులకు వెళ్లి అక్కడ అదనపు తరుగుకు అంగీకరించాల్సిన పరిస్థితులు ఏర్పడడం రైతులను నష్టాలకు, కష్టాలకు గురి చేసింది. ఈ పరిస్థితులన్నింటినీ గమనించి చాలా మంది కల్లాల్లోనే క్వింటాకు రూ.1,700 నుంచి రూ.1,800లకు ధాన్యం అమ్ముకున్నారు. తేమ ఎక్కువగా ఉన్నా వ్యాపారులు అంగీకరించడంతో మద్దతు ధరకు కొంచెం అటుగా ఇటుగా ధర చెల్లించినా వారికే రైతులు అమ్ముకున్నారని పేర్కొంటున్నారు. జిల్లాలో సుమారు 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రైవేట్‌కు అమ్మినట్లు అంచనా. ప్రైవేట్ వ్యాపారులు డబ్బు వెంటనే చెల్లించడం కూడా రైతులు వారికి అమ్ముకోవడానికి ఒక కారణంగా భావిస్తున్నారు.

36,710 మంది రైతుల నుంచి..

ఈ సీజన్‌లో 36,710 మంది రైతుల నుంచి 2,47,398 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ధాన్యం విలువ రూ.509.64 కోట్లు కాగా ఇప్పటివరకు 20,101 మంది రైతులకు చెందిన రూ. 257.80 కోట్లు వారి ఖాతాల్లో జమచేశారు. మరో వారం, పది రోజుల్లో కోతలు పూర్తయి ఈ నెల చివరి నాటికి ధాన్యం అమ్మకాలు నిలిచిపోనున్నాయి. అయితే ఈసారి కొనుగోలు కేంద్రాలకు 3లక్షల మెట్రిక్ టన్నులకు మించి ధాన్యం రాకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

వ్యవసాయ శాఖ అంచనాలు తప్పాయా?

యాసంగిలో జిల్లాలో అత్యధికంగా 4,82,481 ఎకరాల్లో వరి సాగైంది. ఎకరాకు 23 నుంచి 24 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ లెక్కన జిల్లాలో సాగు చేసిన విస్తీర్ణంలో 12,18,146 మెట్రిక్ టన్నుల వరిధాన్యం దిగుబడి వస్తుందని భావించారు. ఇందులో వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యం, రైతుల అవసరాల కోసం వినియోగించుకునే ధాన్యం సుమారు 5,13,731 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంటుందని మిగిలిన 7,04,415 మెట్రిక్ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. ఇందుకు 296 కొనుగోలు కేంద్రాలను అంచానా వేసి 289 ప్రారంభించారు.

సీఎంఆర్‌ను సకాలంలో పూర్తిచేయాలి

- కలెక్టర్ వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సీఎంఆర్ బకాయిలు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రైస్ మిల్లు యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీ 2021–22 సీజన్‌లో సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లర్లు గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో 32,045 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లులు బకాయి ఉన్నాయని, గడువులోగా సీఎంఆర్ అందించని వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ధాన్యం దిగుమతుల్లో ఆలస్యం లేకుండా మిల్లులకు వచ్చిన వెంటనే దిగుమతి చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్ రావు, డీఎస్పీ నాగభూషణం, డీఎం సివిల్ సప్లయ్ రాంపతి, డీఎస్‌ఓ పుల్లయ్య, రైస్ మిల్లుల యజమానులు అసోసియేషన్ సభ్యులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మహాప్రస్థానం పనులు పూర్తిచేయాలి

సూర్యాపేట: పట్టణంలోని సద్దుల చెరువు కట్ట పక్కన చేపట్టిన మహాప్రస్థానం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. ఈ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి తదితరులున్నారు.

కలెక్టరేట్ పనుల పరిశీలన

సూర్యాపేట పట్టణంలోని కుడకుడలో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ వెంకట్రావు గురువారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నూతన సమీకృత భవనంలో ఉన్న ప్రతిశాఖ పనులు వేగంగా జరగాలని, లేబర్, మెటీరియల్ పెంచి పనులను జూన్ మొదటివారం నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ ఎస్‌ఈ నరసింహ నాయక్, ఈఈ యాకూబ్ అలీ ఉన్నారు.



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

వీరారెడ్డి విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి



విగ్రహావిష్కరణ కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : చింతలపాలెంలో ఈనెల 25న నిర్వహించనున్న ఉస్తెల వీరారెడ్డి విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సాగు నీటి సంఘం చైర్మన్‌గా, సింగిల్ విండో వైస్ చైర్మన్‌గా, మల్లారెడ్డిగూడెం సర్పంచ్‌గా వీరారెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విస్తృత సేవలు అందించారని కొనియాడారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రజా ప్రదర్శన, బహిరంగసభకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, ఉస్తెల నారాయణరెడ్డి, జిల్లా నాయకులు కంబాల శ్రీనివాస్, ధనుంజయనాయుడు, దేవరం మల్లీశ్వరి, జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, అమరారపు పున్నయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

లెక్కల్లో తప్పారు!

- ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో గణితంలో ఎక్కువ మంది ఫెయిల్
- గరిష్టంగా 614 మంది అనుత్తీర్ణత
- తరువాత స్థానంలో సైన్స్



పదో తరగతి పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

చిలుకూరు: ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎక్కువ మంది గణితంలోనే ఫెయిల్ అయ్యారు. మ్యాథ్స్ తరువాత సైన్స్‌లో ఎక్కువ మంది కనీస అర్హత మార్కులు సాధించలేకపోయారు. మొత్తం 12,190 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్ష రాయగా.. 10,963 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 1,227 మంది అనుత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 80.91 నమోదైంది. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలను విశ్లేషించగా.. గణితంలోనే 614 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా.. సైన్స్‌లో 484 మంది ఫెయిల్ అయ్యారు. ఈ ఏడాది మన జిల్లా రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. గతేడాది 17వ ర్యాంక్ వచ్చింది. వార్షిక ఫలితాల్లో ఈ ఏడాది మంచి ర్యాంక్ వస్తుందని జిల్లా విద్యాశాఖ ఆశించినప్పటికీ పర్వాలేదన్నట్లుగా వచ్చింది. ఈ ఏడాది ప్రత్యక్ష తరగతులు నిర్వహించినా కొందరి విద్యార్థుల అభ్యసన సామర్థ్యంలో పెద్దగా మార్పు చెందలేదు. ముఖ్యంగా జిల్లాలో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు తెలుగులోనూ 129 మంది ఫెయిల్ అయ్యారు. కాగా.. సైన్స్ పరీక్ష ఒక్క రోజే నిర్వహించినప్పటికీ ఈసారి సైన్స్ సబ్జెక్టు గణితంతో పోలిస్తే కొంత పర్వాలేదనిపించింది. అయితే గణితంలో స్థాయికి మించి ప్రశ్నలు అడగడంతో చాలా మంది ఫెయిల్ అయినట్లుగా గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పేర్కొంటున్నారు.

సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి..

అన్ని మండలాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈమేరకు త్వరలో జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో గణితం, సైన్స్, సోషల్‌లో ఎక్కువ ఉత్తీర్ణత సాధించేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. వేసవి సెలవులు కావడం, ప్రభుత్వం అనుమతిస్తేనే పనిదినాలకు ఈఎల్స్(ఎర్న్‌డ్ లీవ్స్) వచ్చే అవకాశం ఉండడంతో కొందరు ఉపాధ్యాయులు తరగతులు చెప్పడానికి ముందుకు రావడం లేదనే వాదన వినిపిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేస్తే ప్రత్యేక సన్నద్ధతకు అవకాశం ఉంది.

ప్రశ్నపత్రం క్లిష్టంగా ఉండడం కూడా ఒక కారణం



పదో తరగతి గణిత ప్రశ్నపత్రం క్లిష్టంగా ఉంది. సిలబస్‌కు మించిన ప్రశ్నలు, రెండు పేపర్లను ఒకటిగా చేయడం, బిట్లు కూడా కఠినంగా ఇవ్వడంతో విద్యార్థులు అధికంగా ఫెయిల్ అయ్యారు. సీసీఈ విధానంలో విద్యార్థులు సామర్థ్యాలను సార్వత్రీకరణ చేయకపోవడం కూడా ఫెయిల్ కావడానికి కారణంగా చెప్పవచ్చు.

– మందవ ఉపేందర్, స్కూల్ అసిస్టెంట్, చిలుకూరు

సబ్జెక్టుల వారీగా వివరాలు (పరీక్ష రాసిన మొత్తం విద్యార్థులు 12,190)

	తెలుగు	హిందీ	ఇంగ్లిష్	గణితం	సైన్స్	సోషల్
పాసైన వారు	12,061	12,183	11,881	11,576	11,706	12,030
ఫెయిలైన వారు	129	07	309	614	484	160
పాస్ పర్సంటేజ్	98.94	99.94	97.46	94	96.02	98.68

● ప్రశాంతంగా ఎడ్‌సెట్



నల్లగొండలోని ఎస్‌పీఆర్ స్కూల్‌లో గురువారం జరిగిన ఎడ్ సెట్‌కు హాజరైన అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

గుండెపోటు మరణాలు అరికట్టేందుకు..

- వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాలు
- ఇప్పటివరకు 3,815 మందికి శిక్షణ



శిక్షణ పొందుతున్న వైద్యాధికారులు (ఫైల్)

హుజూర్‌నగర్: ఆగిపోయిన శ్వాసను పునఃప్రారంభించేందుకు చేసే ఒక ప్రయత్నమే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్). అనుకోకుండా ఎవరికైనా హృదయ స్పందన ఆగిపోయి కుప్పకూలితే ప్రాణవాయువు అందక 4 నిమిషాల వ్యవధిలో బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశం ఉంది. అలాంటి వారికి సీపీఆర్ చేయాల్సి ఉంటుంది. వయసుతో సంబంధం లేకుండా ఇటీవల ఎంతోమంది గుండెపోటుతో మృత్యువాత పడుతున్నారు. వీరిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా సీపీఆర్ విధానంతో గుండెపోటుకు గురైన వారిని కాపాడేందుకు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ గత నెలలో ప్రారంభం కాగా.. ఇప్పటివరకు వివిధ ప్రభుత్వ శాఖలు, ఇతర వర్గాలకు చెందిన 3,815ల మందికి శిక్షణ ఇచ్చారు. వైద్య ఆరోగ్య, పోలీసు శాఖలతో పాటు ఆర్ఎంపీలకు తర్ఫీదు ఇచ్చారు.

మాస్టర్ ట్రైనర్లకు హైదరాబాద్‌లో శిక్షణ..

తొలుత జిల్లాలో ఐదుగురు వైద్యాధికారులు మాస్టర్ ట్రైనర్లుగా హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. వారి ద్వారా ఇతర వైద్యాధికారులకు, వైద్య ఆరోగ్యశాఖలోని పీహెచ్‌సీల వారీగా తరగతులు నిర్వహించారు. వారి ద్వారా ఇతరులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యాసంస్థలు ప్రారంభమయ్యాక కళాశాలల విద్యార్థులకు కూడా సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. కాగా.. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 3,815ల మందికి శిక్షణ ఇచ్చారు. వారిలో వైద్య ఆరోగ్య శాఖకు చెందిన వారు 2,015 మంది ఉండగా పోలీస్ శాఖ వారు 700 మంది వరకు ఉన్నారు. ఆర్ఎంపీలలో 1,100 మందికి శిక్షణ పూర్తయింది. ఇంకా రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఇతరులకు శిక్షణ ఇవ్వాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఆధునిక జీవనశైలి ప్రభావం

గుండె ఆరోగ్యంపై ఆధునిక జీవనశైలి తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కుటుంబ బాధ్యతలు, మానసిక స్థితిగతుల కారణంగా గుండె ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఒకప్పుడు 60 ఏళ్ల వయసులో కనిపించే గుండె జబ్బులు ప్రస్తుతం 20 నుంచి 35 ఏళ్ల వయసు వారికి వస్తున్నాయి. ఇలా రాకుండా మంచి ఆహారపు అలవాట్లతో పాటు ఒత్తిడికి దూరంగా ఉంటూ తగిన వ్యాయామం చేయాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

సీపీఆర్‌ను సామాజిక బాధ్యతగా భావించాలి



ప్రతిఒక్కరూ సీపీఆర్‌ను సామాజిక బాధ్యతగా భావించాలి. ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారి భుజాల వద్ద తడుతూ స్పందనలు గమనించాలి. వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయాలి. ఈక్రమంలోనే మెడ వద్ద నాడీ స్పందన, శ్వాస పరిశీలించాలి. అవి లేకుంటే సీపీఆర్ చేయడం మొదలుపెట్టాలి.

– డాక్టర్ కళ్యాణచక్రవర్తి, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి, సూర్యాపేట

యువత అన్ని రంగాల్లో ముందుండాలి



మున్నూరు కాపు యువక మండలి జిల్లా విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

భానుపురి (సూర్యాపేట): మున్నూరు కాపు యువత రాజకీయంగా, ఆర్థికంగా, వ్యాపార పరంగా సామాజిక సేవలో ముందుండాలని మున్నూరు కాపు మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మున్నూరుకాపు యువక మండలి జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరు కాపు యువతకు రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో సంక్షేమ శాఖను ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక సాయం, రుణ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు యూత్ జిల్లా అధ్యక్షుడు నల్లగుంట్ల సందీప్, వైఎస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, డేగల రమేష్ నాయుడు, రామసాని రమేష్ నాయుడు, దూళిపాల శ్రీనివాస్, బాల వెంకటేశ్వర్లు, సన్నీరు మురళి, ముత్యాల వెంకటేశ్వర్లు, యాదగిరి, అశోక్, జానకిరాములు, శ్రవణ్ కుమార్, నవీన్, అశోక్ కుమార్, సతీష్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం జిల్లా కేంద్రంలోని నల్లాలబావి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకనబోయిన సైదమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధనియాకుల శ్రీకాంత్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లగొరి గోవింద్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి వీరబోయిన రవి, సీఐటీయూ జిల్లా నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో వృద్ధుడు మృతి

చిలుకూరు: వడదెబ్బతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన కందుకూరి పెంటయ్య (75) కొన్ని రోజులుగా జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. దీనికి తోడు మూడు రోజులుగా ఎండలు మండిపోతుడడంతో వడగాల్పులకు అనారోగ్యానికి గురైన పెంటయ్య ఇంటి వద్దే చిక్సిత పొందుతూ గురువారం మృతిచెందాడు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి భార్య సాయమ్మ కోరారు.

గుండెపోటుతో బస్సు డ్రైవర్ దుర్మరణం

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందిన సంఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా తుర్కపల్లికి చెందిన ఆంజనేయస్వామి భక్తులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో వైజాగ్, భద్రాచలం ప్రాంతాలు సందర్శించి యాదగిరిగుట్టకు వెళ్తున్నారు. మార్గమధ్యలో తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో హైదరాబాద్‌కు చెందిన బస్సు డ్రైవర్ చిట్టిబాబు(35)కు ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పి బస్సును రోడ్డు పక్కకు ఆపి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్యాపిల్లలు ఎవరూ లేరని తెలిసింది.

ఇంటర్ ఫెయిలైందని మందలించిన తల్లి

- ఇంట్లో నుంచి వెళ్లిపోయిన విద్యార్థిని

పాలకవీడు: ఇంటర్ ఫెయిలైందని తల్లి మందలించడంతో విద్యార్థిని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన మండలంలోని ముసివడ్డు సింగారంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ముసివడ్డు సింగారం గ్రామానికి చెందిన స్నేహ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో స్నేహ మూడు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో తల్లి సుజాత ఆమెను మందలించింది. దీంతో తల్లి పనికి వెళ్లిన సమయంలో స్నేహ బట్టలు తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. గత వారం రోజులుగా ఎంత వెతికినా స్నేహ ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి సుజాత గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

భువనగిరిటౌన్ : గిరిజనులు హక్కుల సాధనకు ఉద్యమించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రునాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో గిరిజన సమస్యలపై పార్టీలకు అతీతంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనులకు 6శాతం నుంచి 10శాతం రిజర్వేషన్లు, హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో బంజారా భవన్‌ను సంపాదించుకున్న ఘనత ఏబీఎస్‌ఎస్‌లదే అని అన్నారు. అనంతరం సంఘం జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతావత్ సోమ్లాల్ నాయక్, నాయకులు మాన్యనాయక్, సురేష్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా సభ్యుడి అరెస్ట్

- రూ.7.92 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర


వివరాలు వెల్లడిస్తున్న భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర


స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను చూపుతున్న పోలీసులు

భువనగిరి: సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా సభ్యుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. గురువారం పట్టణంలోని డీసీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సయాన్ లహరి గోవాలో ఉంటూ గత మూడు సంవత్సరాల నుంచి మాదక ద్రవ్యాల వ్యాపారం చేస్తున్నాడు. ఇతడు గోవా రాష్ట్రానికే చెందిన ఎడ్మండ్ దిలీప్ నుంచి సింథటిక్ డ్రగ్స్ కొనుగోలు చేసి అక్కడే కొన్ని ప్రాంతాల్లో తక్కువ ధరలకు, మరికొన్ని ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఇటీవల గోవాలో డ్రగ్స్ వ్యాపారం సాఫీగా సాగకపోవడంతో ఖర్చులకు డబ్బులు లేక అతడు హైదరాబాద్‌లో నైట్ పబ్బుల్లో ఎక్కువగా డ్రగ్స్ వాడతారని తెలుసుకుని ఇక్కడ డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు హైదరాబాద్‌తో పాటు చౌటుప్పల్ ఏరియాలో గత ఆరు నెలల నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం చౌటుప్పల్ మండలంలోని తూప్రాన్‌పేట సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఇతరులకు డ్రగ్స్ సరఫరా చేయడానికి వచ్చిన సయాన్ లహరిని పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.3 లక్షలు విలువ చేసే నీలి రంగు డ్రగ్స్ మాత్రలు(60), రూ.2లక్షల విలువ చేసే పింక్ కలర్ డ్రగ్స్ మాత్రలు(40), రూ.1.80 లక్షల విలువ చేసే మాండి డ్రగ్స్ మందు, రూ.లక్ష విలువ చేసే 3.9 గ్రాముల కొకైన్, ఒక బ్యాగ్, రూ.10వేల విలువ చేసే స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎడ్మండ్ దిలీప్ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మొత్తం ముఠాలో ఎంత మంది ఉన్నారో దర్యాప్తులో తేలుతుందని డీసీపీ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి, సీఐలు మల్లికార్జున్‌రెడ్డి, మోతీరామ్, ఎస్సై లక్ష్మయ్య, పోలీసు సిబ్బంది అనిల్, పాండు ఉన్నారు.

వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు.. ఆస్తి నష్టం


మునగాలలో తగులబడుతున్న గడ్డి మోపులు


రాయినిగూడెం శివారులో కాలిపోయిన బత్తాయి చెట్లను చూపిస్తున్న రైతు

రామగిరి(నల్లగొండ): ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని బత్తాయి తోట దగ్ధమైన సంఘటన తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం శివారులో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామానికి చెందిన రైతుల రెడ్డిపల్లి ఊశయ్యకు రాయినిగూడెం శివారులో 4.5 ఎకరాల బత్తాయి తోట ఉంది. గత ఐదు సంవత్సరాలుగా ఈ తోటను సాగుచేస్తున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని తోటలోని 30 బత్తాయి చెట్లు, 10జామ, మామిడి, కొబ్బరి చెట్లతో పాటు డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.2లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు. అయితే తన తోట పక్కన రైతులు బొస్క నర్సింహ, తాడోజు బ్రహ్మచారి తమ పొలంలో వరి కొయ్యలను తగలబెట్టడంతోనే మంటలు వ్యాపించి బత్తాయి తోట దగ్ధమైందని అనుమానిస్తూ బాధిత రైతు తిప్పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తిప్పలమ్మగూడెంలో వ్యవసాయ సామగ్రి..

అగ్నిప్రమాదంలో వ్యవసాయ సామగ్రి దగ్ధమైన ఘటన గురువారం తిప్పర్తి మండలంలోని తిప్పలమ్మగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. తిప్పలమ్మగూడెం గ్రామ శివారులో రైతు దేవిరెడ్డి నారాయణమ్మకు చెందిన వ్యవసాయ క్షేత్రానికి అనుకొని గురువారం ఉపాధి కూలీలు పనులు చేశారు. ఉపాధి కూలీలు చెత్త తగులబెట్టి ఇంటికి వెళ్లిపోయారు. మంటలు పక్కనే ఉన్న నారాయణమ్మ పొలానికి అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో పొలంలోని మూడు మోటారు స్టార్టర్లు, పైపులు కాలిపోయాయి. రూ.60వేల మేర నష్టం వాటిల్లిందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

మునగాలలో 700 గడ్డి మోపులు..

మునగాల: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని గడ్డి మోపులు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన తోట రాంబాబు ఇటీవల రూ.70వేల విలువ గల 700 గడ్డిమోపులను కొనుగోలు చేసి ఊరి చివరన తనకు సంబంధించిన ఖాళీ స్థలంలో గడ్డివాములుగా ఏర్పాటు చేసుకున్నాడు. అయితే గురువారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డిమోపులు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చే లోపే గడ్డి మోపులు పూర్తిగా కాలిపోయాయని బాధితుడు తెలిపాడు.

ట్రావెల్స్ బస్సు బోల్తా

- క్షేమంగా బయటపడిన ప్రయాణికులు

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలో గురువారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్తున్న ఈ బస్సు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం దాటాక రహదారి నుంచి పక్కకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. అయితే, రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ రాళ్లను తాకి బస్సు ఆగడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 13 మంది ప్రయాణికులు ఉండగా ఒక మహిళకు మాత్రమే స్వల్ప గాయాలయ్యాయి. మోతె పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు.. ఐదుగురిపై కేసులు

- 22 లీటర్ల సారా స్వాధీనం


పట్టుబడ్డ నిందితులతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: నియోజకవర్గంలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 22 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. గురువారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఎక్సైజ్, నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా గరిడేపల్లి, మఠంపల్లి మండలాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గరిడేపల్లికి చెందిన బొజ్జె మంగమ్మ, గండు శ్రీదేవి, రాములమ్మ, చిన్నగారకుంట తండాకు చెందిన బాణోతు కుమారి, చౌటపల్లికి చెందిన జి. గురవయ్యల వద్ద నుంచి 22 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ శివకష్ణ, స్థానిక ఎక్సైజ్ ఎస్‌ఐ దివ్య, సిబ్బంది స్వామి, శేఖర్ రెడ్డి, బ్రహ్మం, ఆయూబ్, నాగరాజు పాల్గొన్నారు.

అమెరికా వెళ్తాడనుకుంటే అనంతలోకాలకు..

- గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- చిలుకూరు గ్రామ శివారులో ఘటన


ఉదయ్‌కిరణ్ (ఫైల్)

చిలుకూరు: మరో 20 రోజుల్లో ఉన్నత చదువుల నిమిత్తం అమెరికాకు వెళ్లాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. బుధవారం అర్ధరాత్రి చిలుకూరు గ్రామ శివారులోని శివరాత్రి నగర్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన పొందూరి సత్తిబాబు కుమారుడు పొందూరి ఉదయ్‌కిరణ్(25)తో పాటు అదే గ్రామానికి చెందిన మారోజు శివ బైక్‌పై హుజూర్‌నగర్ వెళ్లి వస్తున్నారు. మార్గమధ్యలో చిలుకూరు గ్రామ శివారులోని శివరాత్రి నగర్ దగ్గరకు రాగానే బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్ వెనుక కూర్చున్న ఉదయ్‌కిరణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న శివకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఉదయ్‌కిరణ్ మృతదేహానికి కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లుగా ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మృతుడి తండ్రి సత్తిబాబు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడు ఉదయ్‌కిరణ్ బీటెక్ పూర్తిచేసి అమెరికాలో ఎంఎస్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. రోడ్డు ప్రమాదం జరగకపోతే మరో 20 రోజుల్లో అమెరికాకు వెళ్లేవాడని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఉదయ్‌కిరణ్ అకాల మరణంతో చిలుకూరు గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

క్రీడాకారులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న భూలోకరావు

హుజూర్‌నగర్: క్రీడాకారులు శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుని ప్రతిభ కనబర్చాలని నల్లగొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్, రాష్ట్ర కబడ్డీ క్రమశిక్షణ (డిసిప్లీనరి) సంఘం కమిటీ చైర్మన్ భూలోకరావు అన్నారు. పట్టణంలోని వీవీఎం స్కూల్లో శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ ఉచిత శిక్షణ శిబిరాన్ని గురువారం సందర్శించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వాలీ బాల్ గోల్డ్ మెడలిస్ట్ చందా సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో క్రీడల్లో నైపుణ్యాలు నేర్చుకుని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. క్రీడాకారులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఈ ప్రాంతానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. స్టేట్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తనవంతు సహకారాలు క్రీడాకారులకు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాంతిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చందా సుధాకర్‌రెడ్డి, పీడీ నాగమణి, పీఈటీలు ప్రదీప్, బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఏడుకు చేరిన మృతుల సంఖ్య

మిర్యాలగూడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగుల వద్ద ఈ నెల 17న ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరుకుంది. దామచర్ల మండలం నర్సాపురానికి చెందిన మహిళా వ్యవసాయ కూలీలు మిర్చి పంట కోసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగగా అదే రోజు ఆరుగురు మృతిచెందారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన మాలోతు దేవి(55) చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందింది. ఒక కుమార్తె ఇస్లావత్ మంజుల ప్రమాదం జరిగిన రోజే మృతిచెందింది. దేవి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి కాలువలో పడిన బైక్.. వ్యక్తి మృతి


కాలువలో బైక్‌తో పాటు లాలుసాహెబ్ మృతదేహం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పెద్దవూర: బైక్ అదుపుతప్పి కాలువలో పడటంతో వ్యక్తి మృతిచెందిన ఘటన పెద్దవూర మండలంలోని చింతపల్లి స్టేజీ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం పెద్దపాలెం గ్రామానికి చెందిన షేక్ లాలుసాహెబ్(50) ప్రతి ఏడాది సీజన్ వారీగా కుటుంబంతో కలిసి మండలానికి వచ్చి ధాన్యం తడవకుండా వేసే కవర్(పట్టాలు)లు అద్దెకు ఇచ్చుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ యాసంగి సీజన్‌లోనూ మండలంలోని నాయినవానికుంట స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద చిన్నపాటి గుడిసె ఏర్పాటు చేసుకుని రైతులకు పట్టాలు కిరాయికి ఇస్తున్నాడు. అదేవిధంగా నిడమనూరు మండలంలోని పార్వతీపురం గ్రామం వద్ద సైతం రైతులకు పట్టాలను అద్దెకు ఇస్తున్నాడు. బుధవారం సాయంత్రం లాలుసాహెబ్ బైక్‌పై పార్వతీపురం వెళ్లి పనులు చూసుకుని మంచం, కోళ్లను తీసుకుని నాయినవానికుంటకు తిరుగుపయనమయ్యాడు. మార్గమధ్యలో పెద్దవూర మండలంలోని చింతపల్లి స్టేజీ సమీపంలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాలువ డిస్ట్రిబ్యూటరీ–8, 9పై ఏర్పాటు చేసిన వంతెన వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి పదిహేను అడుగుల లోతులో ఉన్న కాలువలో బైక్‌తో సహా పడిపోయాడు. దీంతో లాలుసాహెబ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం వ్యవసాయ పనులకు ఆటుగా వెళ్లిన రైతులకు వంతెన కింద బైక్‌తో పాటు గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడు పట్టాలు కిరాయికి ఇచ్చే లాలుసాహెబ్ అని గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని లాలుసాహెబ్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. బుధవారం రాత్రి లాలుసాహెబ్ ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో.. పార్వతీపురంలోనే ఉండి ఉదయాన్నే వస్తాడులే అనుకున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ ఘటనా స్థలానికి చేరుకుని బైక్, మృతదేహాన్ని స్థానికుల సహాయంతో కాలువ నుంచి బయటకు తీయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ద్రాక్షాభి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కుక్క అడ్డురావడంతో..


గోవిందస్వామి (ఫైల్)

కోదాడరూరల్: కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి లైన్ ఇన్‌స్పెక్టర్ మృతిచెందిన ఘటన కోదాడ మండలం కాపుగల్లు రెవెన్యూ పరిధిలోని తొగర్రాయి సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన మిర్యాల గోవిందస్వామి(56) మునగాలలో విద్యుత్‌శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా గురువారం కూడా విధులకు హాజరయ్యేందుకు అతడు బైక్‌పై వెళ్తుండగా కూచిపూడి–తొగర్రాయి సబ్‌స్టేషన్ రోడ్డులో బైక్‌కు కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోయి ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో బైక్ అదుపతప్పి రోడ్డుపై పడటంతో గోవిందస్వామి ముఖం, తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని కోదాడకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

పంట మార్పిడితో అధిక లాభాలు

- వేర్వేరు పంటల సాగుతో పెరగనున్న దిగుబడి
- తగ్గనున్న చీడపీడల బెడద
- పెద్దవూర ఏఓ సందీప్ సూచనలు

పాడి పంట


సాగవుతున్న మిరప పంట

పెద్దవూర: రైతులు వేసిన పంటలే మళ్లీ వేస్తూ బాగా నష్టపోతున్నారు. పంట మార్పిడి చేయకపోవడంతో చీడపీడల వ్యాప్తి ఎక్కువై దిగుబడి తగ్గుతుంది. భూమి సైతం నిస్సారంగా మారుతుంది. పంట మార్పిడి చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చునని మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ సూచిస్తున్నారు. వేర్వేరు పంటలు సాగు చేస్తే రైతులకు దిగుబడి పెరగడంతో పాటు భూమిలో సారం పెరుగుతుంద ని, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. పంట మార్పిడికి సంబంధించి సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

పంట మార్పిడితో..

- నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది.
- భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది.
- చీడపీడలు దూరం అవుతాయి.
- ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది.
- శిలీంధ్ర వ్యాధులను దూరం చేయవచ్చు.
- బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువగానే ఉంటుంది.
- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా చేసుకోవచ్చు.
- పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశం ఉంటుంది.

పంటమార్పిడిలో తీసుకోవాల్సిన మెళకువలు

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటల్ని ఎంపిక చేసుకోవాలి. శనగ, బొబ్బెర, పెసర, మినుము వంటి పంటలను వేసుకోవడం వలన నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివలన కలుపు మొక్కలను నివారించవచ్చు.
- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరకు వేయడం వలన సుడిదోమ, తుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.
- పత్తి సాగు చేసిన నేలలో మినుము, పెసర వంటివి వేయడం వలన తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలి. దీనివలన వెరుశనగ పంటను ఆశించే ఆకుముడత ఉధృతిని తగ్గించవచ్చు.
- పసుపు తర్వాత వరి, జొన్న వంటి పంటలను సాగు చేసుకోవాలి. దీనివలన నేలలో నెమటోడ్ల సంఖ్య తగ్గుతుంది.
- నులిపురుగుల సమస్య అధికంగా ఉన్న ప్రదేశంలో వేరుశనగ, మిరప, పొగాకు, వంగ పంటలను కొంతకాలం పాటు తప్పనిసరిగా ఆపాలి.

ఇలా చేసుకోవచ్చు..

యాసంగిలో వేరుశనగ సాగు చేసిన రైతులు తర్వాత వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. కంది, శనగ పంటలను వరుసగా వేస్తే కాయతొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకే ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మెట్టవరి వంటి పంటలతో మార్పిడి చేసుకోవాలి. వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసే వారు కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్యాల పంటలను లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పంటలను లేదా వేరుశనగతో పంట మార్పిడి చేసుకోవచ్చు.

ధాన్యం పంటలతో ...

దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయల పంటలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవాలి. ఉల్లిసాగు చేసే రైతులు ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. వరి, చెరుకు, అరటి, తమలపాకు, కూరగాయల పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులి పురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వేరుశనగ, క్యాబేజీ పంటలను ఆశించే లద్దె పురుగుల తాకిడి అరికట్టాలంటే జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలతో మార్పిడి చేయాలి.

ఎంపికలో జాగ్రత్తలు

పంట మార్పిడి చేయాలంటే అంతకు ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పంటను ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థలు నేలలోని పొరల నుంచి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహిస్తూ ఉంటాయి. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకుంటాయి. ఆకుల్ని రాల్చి భూమికి సేంద్రియ పదార్థాన్ని అందిస్తాయి. అపరాల పంటల మీద ఉండే బుడిపెలు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. సూక్ష్మజీవుల చర్య వల్ల ఎంజైముల ఉత్పత్తి పెరుగుతుంది. నల్లరేగడి నేలల్లో సోయాచిక్కుడు వేసుకుంటే పంట కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రియ పదార్థం లభిస్తుంది.

ఇలా చేయవద్దు..

పంట మార్పిడి చేసే సమయాలలో అనుకూలమైన పంటనే ఎంచుకోవాలి. లేదంటే చీడపీడల ఉధృతి ఎక్కువ అవుతుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఎందుకంటే ఈ రెండు పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన పొలాల్లో మిరప వేయకూడదు. పసుపు తర్వాత మిరప, టమాట, క్యాబేజీ, దోస, గుమ్మడి, సొర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు. ఆకుముడత ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయాచిక్కుడు వేయకూడదు.